# ఫిఫ్టీ ఫిఫ్టీ

తిథి వార నక్షత్రాలేవీ తెలియడం లేదంటూ కొత్త పంచాగం క్యాలెండరు పట్టుకురమ్మని వారం రోజులైపోరుతోంది శ్రీమతి. ఏరోజుకారోజు కొని తెద్దామనే అనుకుంటున్నా గుర్తుండి చావడం లేదు. అందుకే ఆవేళ ఆ విషయం గట్టిగా గుర్తు పెట్టుకుని ఆఫీసు అయిపోగానే అటు నుంచి అటు బజారుకెళ్ళి క్యాలండరు కొన్నాను. దాని మీద జాతకరత్నం, జాతకశిరోమణి శివయ్య సిద్ధాంతి గారిచే గుణించబడినది అని వుంది. అది చూసి షాక్ తిన్నాన్నేను. మా శివగాడు ఉన్నట్లుండి జాతకశిరోమణి ఎప్పుడైపోయాడా అనిపించింది.

మొన్నమొన్నటి వరకు కాలేజీలో ఒకే బెంచీమీద కూర్చుని చదువుకున్నాం. మూడేళ్ళు ఉద్యోగవేటలో గడిపాం. నా అదృష్టం బాగుండటంతో గ్రూప్ త్రీ రాయగానే నన్ను ఉద్యోగం వరించింది. వాడు మాత్రం ఇంకా నిరుద్యోగ పర్వంలోనే ఉన్నాడు. మరి జాతక శాస్త్రాన్ని ఎప్పుడు అభ్యసించాడో నా ఊహకు అందడం లేదు.

ఆలోచిస్తూ మెదడు పాడుచేసుకునే బదులు వాడినే అడిగేస్తే పోలా అనిపించింది. మరునాడే వాడింటికెళ్ళాను. ఇప్పుడు వాడి గెటప్ కూడా మారిపోయింది. ప్యాంటు షర్టుకు బదులు పంచె లాల్చీ, మెడలో రుద్రాక్షలు, చెవులకు పోగులు, నుదుట కుంకుమ బొట్టు అచ్చంగా శాస్త్రులవారి మల్లె కనిపిస్తున్నాడు. నన్ను చూడగానే ఆప్యాయంగా పలకరించి లోపలకు తీసుకెళ్ళాడు.

"ఔనూ, నిన్నటి దాకా కెమిస్ట్రీ, ఫిజిక్సు చదివిన వాడివి ఒక్కసారిగా ఎస్ట్రాలజిస్ట్ ఎలా అయిపోయావురా?" అని అడిగాను.



అందుకు వాడు చిరునవ్వు నవ్వుతూ "ఏం అవకూడదా?" అంటూ ఎదురు ప్రశ్న వేసాడు.

"అది కాదు నా ఉద్దేశం. దేనికైనా కొంత సమయం పడుతుంది కదా మరి నువ్వు ఇప్పటికిప్పుడు జాతక శిరో మణి ఎలా అయిపోయావా అని"

"నువ్వు నా ఆప్త మిత్రుడివి గనుక చెప్తున్నాను. ఎవరితో అనకు సుమా! పంచాంగకర్తలు రాసిన పంచాంగాలలోని తిథుల వేళల్లో పది పదిహేను నిమిషాలు అటు ఇటుగా మార్చేసి నా పేరున ప్రింటు చెయ్యమన్నాను నాకు పరిచయమున్న ప్రెస్‌వాణ్ణి. అంతే, అవి హాట్‌కేకుల్లా అమ్ముడైపోతున్నాయి." చేస్తున్న పనిని దాచకుండా చెప్పేసాడు శివుడు.

"అది సరే, నీ దగ్గరకెవ్వరైనా వచ్చి పెళ్ళి ముహూర్తాలు పెట్టమని గాని, జాతకం రాసిపెట్టమనిగాని అడిగితే ఏంచేస్తావప్పుడు? నీ బండారం బయటపడిపోదూ!"

"ఆ బెంగేమీ నీకక్కర్లేదు. పధూవరుల వివరాలు నోట్ చేసుకుని వారం రోజుల తర్వాత రమ్మంటాను. ఈలోగా ఏ సిద్ధాంతి చేతో జాతక చక్రం గీయించేసి నా లెటర్ పాడ్‌మీద దానిని కాపి చేసి వచ్చిన వ్యక్తికి ఇచ్చేస్తాను. ఇక్కడ వంద తీసుకుంటాను, అక్కడ యాభై పారేస్తాను. నాకు అతడికి ఫిఫ్టీ ఫిఫ్టీ దట్సాల్. మరి నేనూ బ్రతకాలా? కోటివిద్యలు కూటి కొరకే అని ఊరికే అన్నారా పెద్దలు" అంటూ అసలు రహస్యాన్ని బహిర్గతం చేసాడు శివుడు.

**(17-1-2000 ఆంధ్రభూమివీక్లీ)**